## సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బుధవారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో సెక్రెటేరియట్‌లో సుదర్శన్‌రెడ్డిని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించడమే కాకుండా శుభాకాంక్షలు తెలియజేశారు.


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 06 నవంబరు, 2025 | పేజీలు :06


# నేత్రపర్వంగా పంచ సహస్ర దీపారాధన

**ప్రజాపక్షం/ధర్మపురి :** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) లో బుధవారం సాయంత్రం దేవస్థానం పక్షాన నిర్వహించిన పంచ సహస్ర దీపారాధన నేత్రపర్వంగా కొనసాగింది.గత కొన్నేళ్లుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అపరూప కార్యక్రమంలో స్థానికులు, భక్తులు,విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు.బ్రహ్మపుష్కరిణి లోని నాలుగు వైపులనున్న మెట్లపై అయిదు వేలకు పైగా దీపాలను వరుస క్రమంలో పేర్చి సాయంత్రం ఏక కాలంలో దీపాలను వెలిగించారు.దీప కాంతులతో బ్రహ్మపుష్కరిణి ప్రాంతం వెలుగులు విరాజిల్లాయి.అనంతరం కోనేరు మధ్య భాగంలోని భోగ మండపం లోని వేదికపై లక్ష్మీ నరసింహస్వామి చిత్రపటాన్ని ఉంచి ఆస్థాన వేదపండితులు, అర్చకులు సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిమంది భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్,దేవస్థానం అధ్యక్షులు జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల
# పెండింగ్ బిల్లులు చెల్లించాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్:** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. బుధవారం ఎఐటియుసి సిరికొండ మండల కమిటీ సమావేశం జరగగా ముఖ్యఅతిథులుగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా చక్రపాణిలు హాజరై మాట్లాడారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 5లోగా వంట బిల్లులు వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లు స్కావెంజర్లకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా 26 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులు రావల్సి ఉంటే వాటిని చెల్లించకుండా ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టమని ఒత్తిడి చేయటం సరికాదన్నారు. ఇప్పటికే అప్పుల పాలైనటువంటి కార్మికులను మెనూ అమలు చేయడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రమీల, బుచ్చవ్వ, పద్మ, బాలమణి, కార్మికులు పాల్గొన్నారు.

## కార్తీక పూర్ణిమ జాతరలో
# ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

**ప్రజాపక్షం/తానూర్:** మండల కేంద్రంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న కార్తిక మాస ఉత్సహాలు బుధవారం ముగిసింది.బుధవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో కుస్తిపోటిలు నిర్వహించారు.ఈ కుస్తిపోటిల్లో తెలంగాణ,మహారాష్ట్ర,కర్ణాటక,మల్లయోదులు పాల్గొన్నారు.మంగళవారం కార్తిక మాసం పురస్కరించుకొని రాత్రి రథోత్సవం,గ్రామ విదుల గుండా వైభవ పేతంగా నిర్వహించారు.పెద్ద ఎత్తున అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కుస్తిపోటిల్లో గెలుపొందిన ప్రథమ బహుమతి 11,111 రూ.తో పాటు వెండి కడివయం ద్వితీయ బౌహుమతి 8851,రూపాలు బాహుమతిలను ఆలయ కమిటీ,గ్రామ కమిటీ వారు అందజేశారు.

**జాతరకు భారీ బందోబస్తు..**

జాతరలో భాగంగా జాతర,కుస్తీ పోటీలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా సీఐ మల్లేష్,ఆధ్వర్యంలో ఎస్ఐ హనుమాన్లు,షేక్ జుబేర్ పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పంగి పండరి,ఉపాధ్యక్షుడు తాడేవార్ విట్టల్,మాజీ సర్పంచ్లు తాడేవార్ విట్టల్,ఆలయ కమిటీ కార్యదర్శి గోవింద్ పటేల్,సొసైటీ డైరెక్టర్ హెచ్ పుండ్లిక్, ఏఎంసీ డైరెక్టర్ మౌలా ఖాన్,గ్రామ పెద్దలు శివాజీ రావ్ పటేల్,మాజీ ఉప సర్పంచ్ షాన్వాజ్ ఖాన్,నాయుమ్, అరుణ్ దేశపాండే,హెచ్ విట్టల్, సోంనాథ్, రఫీక్ ఖాన్, అబ్దుల్ కరీం, గంగాధర్, గార్గోట్ పోశెట్టి, భద్రే సాయినాథ్, డి.సుభాష్. డి.సంతోష్, గణేష్, ధర్మోడ్ యోగేష్, పూనోడ్ సాయినాథ్, గజానంద్, ఏపదేవిదాస్, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# దేవాలయాలకు పోటెత్తిన భక్తులు

**ప్రజాపక్షం/మల్యాల:** కార్తీక పౌర్ణమి ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు లో బుధవారం34 వ గిరి ప్రదక్షిణ ను చిలుకూరు బాలాజీ టెంపుల్ అర్చకుడు సురేశ్ ఆత్మరాం మహా రాజ్ శర్మ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గిరి ప్రదక్షిణ కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండే కాక ,హైదరబాద్ లాంటి ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారని,కొండగట్టు అంజన్న ఆశీర్వాదం తోనే భక్తుల గిరి ప్రదక్షిణ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుందన్నారు. గిరి ప్రదక్షిణ లో పాల్గొన్న భక్తులు జై శ్రీ రామ్,జై హనుమాన్ అని అనుకుంటూ ఉత్సహంగా గిరి ప్రదక్షిణ లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో సురేష్ ఆత్మ రామ్ తో పాటు , మాజీ ఎంపిపి ఆదిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పొన్నం మహేష్,అంజిరెడ్డి, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కిషన్ రెడ్డి,కే.అరుణ, కేశవరెడ్డి,ఉమా, దివ్య, రాజు, పద్మ, మల్లా రెడ్డి, రవీందర్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.



## మార్మోగిన శివనామస్మరణం

**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమశివుని మదినిండా కొలిచారు. స్వామి వారికి రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈవో వి. అనూష అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, ధర్మకర్తలు కిష్టయ్య, శంకర్ గౌడ్, శ్రీనివాస్, సత్యం, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ, పాల్గొన్నారు.

## గోదావరి మహా హారతి ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/గోదావరిఖని :** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోయల్‌వాడ పుష్కరఘాట్ గోదావరినది తీరాన గురువారం గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణతోపాటు సమితి ప్రతినిధులు మాడ ప్రభాకర్ రెడ్డి, తమ్మనవేణి మల్లేశం, మిడివెల్లి అంజిబాబులు గోయల్‌వాడ గోదావరినది ఒడ్డున ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం గోదావరి మాతకు కుంభ హారతి, నక్షత్ర హారతి, కర్పూర హారతి, ధూప హారతి ఇవ్వడంతోపాటు శ్రీశ్రీశ్రీ పరబ్రహ్మానందగిరిస్వాముల వారు భక్తులకు గోదావరి మహా హారతి ప్రాధాన్యత గురించి వివరించనున్నట్లు తెలిపారు. అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్‌పటేల్, ఎంపిడివో వేముల సుమలత, ఛార్టెడ్ అకౌంటెంట్ సత్యనారాయణలు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

## హామీలు నెరవేర్చకుండా కాలయాపన!

**ప్రజాపక్షం/పాలకుర్తి :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని, ముందు ఆ హామీలను నెరవేర్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ముల్కల కొమురయ్య అన్నారు. బుధవారం ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 6 గ్యారంటీలు, 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ ప్రజలకు చేసింది ఏమిలేదని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, బిఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి జరిగిందనే విషయాన్ని ప్రజలు గుర్తించారని ఆయన అన్నారు.

## కరీంనగర్‌సిటీలో



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. సత్యనారాయణ స్వామి వ్రతాలకు బుధవారం మహాశక్తి టెంపుల్ ఒక తెలంగాణ అన్నవరంగా మారింది. దేవాలయంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన మండపం వేయగా అందులో సామూహికంగా శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం కన్నుల పండుగగా జరిగింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఆలయ వేద పండితులు ఇట్టి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం శివ కేశవుల ఆరాధనకు ముఖ్యమైనదన్నారు. ఈ మాసంలో ప్రతి ఒక్కరూ చేసే పవిత్రమైన పూజ సత్యనారాయణ స్వామి వ్రతం అని పేర్కొన్నారు. వ్రతాన్ని ఆచరించడం వల్ల సత్యనారాయణ స్వామిని పూజించడం వల్ల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, కష్టాల నుంచి విముక్తి లభిస్తుందని, విశేషంగా కుటుంబ శ్రేయస్సు కలుగుతుందని, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా భార్యాభర్తలు ఆనందంగా ఉండేందుకు ఈ సత్యనారాయణ స్వామి వారు కాపాడుతారని హిందువుల విశ్వాసం. ప్రజల యొక్క పాపాలను, బాధలను, కష్టాలను తీర్చే వ్రతం ఈ సత్యదేవుని వ్రతమని సాక్షాత్తు విష్ణుమూర్తి నారదునికి చెప్పినట్లు పురాణాలు చెబుతున్నాయి. పూజ అనంతరం ఆలయ అర్చకులు వ్రతంలో పాల్గొన్న దంపతులకు స్వామి వారి ప్రసాదంతో పాటు ఆశీర్వదించారు. ఎవరైతే ఆలయాల్లో ,పవిత్ర స్థలాల్లో దీపాలను దానం చేస్తారో వారికి కోటి జన్మల పుణ్యం లభిస్తుందని, ఈ దీపం మనలోని అంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని, తద్వారా మోక్ష ప్రాప్తికి దారి చూపుతుందని హిందువుల విశ్వాసం, ఈ సంధర్భంగా అనేక మంది భక్తులు దేవాలయంలో దీప దానాలను అందించారు.

## గోదావరిఖనిలో



**ప్రజాపక్షం/గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామం మధ్యలపల్లెలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అంతర్గాంపాలకుర్తి మీడియా కోఆర్డినేటర్ గాదె సుధాకర్, స్రవంతి(మాధవి) దంపతులు తమ స్వంత ఖర్చు రూ.20 వేలతో పోచమ్మ దేవాలయానికి పైకప్పు రేకులు వేయించారు. బుధవారం కార్తీకమాసం పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి గ్రామ ప్రజలతో కలిసి వారు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ అభివృద్ధితోపాటు అధ్యాత్మిక సేవలు అందిస్తున్న సుధాకర్ దంపతులను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గంగాధరి శ్రీనివాస్‌గౌడ్, మారపెల్లి నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మరి రాజ్‌కుమార్, నాయకులు గెల్లు కొమురయ్య, మొండే మల్లయ్య, అగ్గు భూమేష్, గెల్లు చేరాలు, సామల మధునయ్య, సామల కుమార్, ఆకుల రాము, సామల మహేష్, సామల అభి, పిలకని పోచయ్య, గుడికందుల గురువయ్య, పిలకని సతీష్, పూదరి స్వామి, సామల నర్సయ్య, ఉప్పులేటి వరుణ్, సొల్లు పోచయ్య, ఉప్పులేటి శేఖర్, మేస్త్రీలు గెల్లు శ్రీనివాస్, సున్నం కనుకయ్య, కారుపాకుల నరేష్, నగేష్, పంబాల రావుల కుమార్, రాజేష్‌లు పాల్గొన్నారు.

## ధర్మపురి క్షేత్రంలో



**ప్రజాపక్షం/ధర్మపురి :** దక్షిణ కాశీ నవనారసింహ క్షేత్రాలలో ఒకటైనధర్మపురి క్షేత్రం బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా వేలాధి మంది భక్తజనంతో పోటెత్తింది. కార్తీక మాస పర్వధిన పవిత్ర గోదావరి నదీ స్నానం, దైవ దర్శనార్థం మంగళవారం రాత్రినుంచే తెలంగాణ నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజామునుంచే గోదావరినదిలో మంగళస్నానాలు ఆచరించి స్థానిక దైవం లక్ష్మి నర్సింహుని దర్శనార్థం దేవస్థానం ముందు బారులు తీరారు. వేకువ జామునే ఆలయాల అర్చకులు ప్రధానాలయం శ్రీయోగానంద స్వామి, ఉగ్రనర్సింహ స్వామి, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాలలోని స్వామివారలను అభిషేకించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు,అర్చనలు, నిత్యకళ్యాణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అశేష భక్తజనం, ప్రత్యేక పూజలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరిక చెట్టువద్ద కార్తీక దామోదరునికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులకు దీపాలను ధానం చేసుకున్నారు. గోదావరినదిలో దొప్పలలో వెలిగించిన కార్తీక దీపాలను నది నీటిలో వదిలిపెట్టారు. దేవస్థాన ఈవో సంకటాల శ్రీనివాస్, పాలకమండలి అధ్యక్షులు జక్కు రవీందర్,ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ధర్మపురి పోలీస్ సిఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్ కుమార్,రవికుమార్ ల ఆధ్వర్యంలో గట్టిబందోబస్తు నిర్వహించారు.

## ఆలయాల్లో కార్తీక దీపోత్సవాలు



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి మండలంలోని వివిధ దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం శివ కేశవ ఆలయాల్లో భక్తులు గోధుమ పిండితో తయారు చేసిన ప్రమిదలతో ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు ఆచరించారు. అలాగే ప్రతి ఒక్కరూ ఇండ్లలో సత్యనారాయణ వ్రతాలు, కేదారేశ్వర స్వామి వ్రతాలు జరుపుకున్నారు. వీటితో పాటు తులసిచెట్టు వద్ద కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు, చిన్నారులు పాల్గొని ఆనందోత్సవాల మధ్య కార్తీక పౌర్ణమి సంధర్భంగా టపాసులు కాల్చి కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఇల్లందకుంటలో

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** శివునికి విష్ణువుకు ప్రీతికరమైన బుధవారం కార్తీక దీపాలను వెలిగించడం వల్ల తెలిసీ తెలియక చేసిన తప్పులు హరిస్తాయని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలె రామారావు అన్నారు. కార్తీక పౌర్ణమి దీపపు కాంతులతో ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. బుధవారం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం భక్తులకు పులిహోర, లడ్డును ప్రసాదంగా అందించారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్, ధర్మకర్త రామ్‌రెడ్డి, ఆలయ అర్చకులు వంశీదరాచార్యులు, నవీన్, ఆలయ అధికారులు మోహన్, మల్లారెడ్డి, గుణసాగర్, రమేష్ తదితరులున్నారు.

### ముత్తారంలో

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఓడేడ్ గ్రామంలో మల్లికార్జున స్వామి దేవాలయంలో, అభయాంజనేయ స్వామి ఆలయంలో అడవి శ్రీరాంపూర్ శివాలయంలో తోపాటు ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సందరెల్లి శివాలయంలో పాటు తదితర గ్రామాల్లోని బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో శివాలయాల్లో కార్తీక పూజలు దీపారాధన వేడుకలు చేపట్టడంతో ఆయా దేవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

### వేములవాడలో

**ప్రజాపక్షం/ వేములవాడ :** కార్తీక మాసం పౌర్ణమి పర్వదిన సందర్భంగా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయంలో బుధవారం అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.ముందుగా శ్రీ తులసిమాత కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రహారంతో పాటు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ స్వామి వారి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ వ్యవస్థాపక అనువంశీయ ధర్మకర్త గౌరిశెట్టి మహేందర్, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### గొల్లపల్లిలో

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని బీమ్ రాజు పల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మన కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, గణపతి పూజ గౌరీ పూజ క్రతువులు పూజ భక్తజనం మధ్య ఘనంగా నిర్వహించారు.బుధవారం కార్తీక మాసం పౌర్ణమి పురస్కరించుకుని కలశ స్థాపన, గణపతి పూజ, శ్రీరమ సమేతా సత్యనారాయణ స్వామి వ్రతం, నవ విధాభిషేకం, నవగ్రహ పూజలు, అష్టదిక్పాలక పూజలు, బ్రహ్మశ్రీ తిప్పర్తి సత్యాచార్యుల కరకములచే వేధమంత్రోచ్ఛరణాల మధ్య భక్తి శ్రద్ధలతో కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో 8 మంది జంటలు వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. అలాగే దేవీ నవరాత్రి ఉత్సవాల లో అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యంతో మహా అన్నదాన ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ భక్త మహాశయులు, గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న పూజలు భారం కానున్నాయ్

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఆర్జిత సేవల పెంపు దలరుసుములు ఈ నెల 15 నుండి అమలు లోకి తేనున్నట్లు ఈవో శ్రీకాంత రావు తెలిపారు. బుధవారం కొండగట్టు ఆలయ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలయ అభివృద్ధి పై పలు విషయాలు వెల్లడించారు. ఆంజనేయ స్వామి పేరిట రాంసాగర్ గ్రామం లో ఉన్న 8 ఎకరాలు,దిగువ కొండగట్టు ప్రాంతం లో 3 ఎకరాల విలువైన భూములను లీజు కు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు, ఆలయ పరిధిలో కొత్తగా టెంట్, కట్టెల స్థానం లో గ్యాస్ సిలిండర్ల టెండర్లు నిర్వహిస్తామని,ఆలయ వెనుక బాగం లో భోగ శాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పెంచిన టికెట్ ధరలు : స్వామివారి సుప్రభాత సేవ ఇద్దరికీ మాత్రమే రూ.1,000, వడమాల భోగం రూ.1,116, యాగశాలలో మన్యసూక్త హోమం లో పాల్గొనే వారు రూ.2 వేలు చెల్లిస్తే పూజ సామాగ్రి అందజేస్తామని, శనిగ్రహ నివారణ పూజ రూ.1,000, స్వామివారికి చందన పూజ రూ.1500, అంతరాలయ దర్శనం రూ.800, ఆలయం ముందు గండదీపంలో నూనె పోయడానికి రూ.10, పదేళ్ల పాటు వ్యక్తి పేర శాశ్వత అభిషేకం రూ.10,116, 11 రోజుల పాటు స్వామివారికి హారతి సమర్పించడానికి రూ.516 చొప్పున ధరలు నిర్ణయించి టికెట్లు ముద్రించినట్లు గండదీపం వద్ద నూనె పోయడానికి మొదటిసారిగా రూ.10 చొప్పున నిర్ణయించారు. వడమాల భోగం చేసే వారికి 5 వడలు, లడ్డూ అందజేస్తారు. ఇతర ఆర్జిత సేవల టికె ట్లతో పూజలు చేసే వారికి స్వామివారి కండువా, కను ములు, 400 గ్రాముల లడ్డూ అందజేస్తామని ఈవో తెలిపారు.

మంగళ, శని, ఆది వారాల్లో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. ఆర్జిత సేవల టికెట్ ధరలు పెంచడం వలన సాదారణ భక్తులపై భారం పడే అవకాశం ఉన్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సమావేశం లో ఆలయ ఆదాయాన్ని పెంచుకోవడానికి పలు ప్రతి పాదనలు చేశారు తప్ప, భక్తులకు మెరుగైన సౌక ర్యా లు కల్పించడానికి ఒక్క మాట మాట్లాడక పోవడం కొస మెరుపు.

## ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పిట్లం విద్యార్థి

**ప్రజాపక్షం/పిట్లం:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు పిట్లం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవులు తెలిపారు. తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పి.గణేష్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కబడ్డీ సెలక్షన్ అండర్ 17లో గణేష్ ఎంపికై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడూళ్ళ బయ్యారంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సదరు విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవిసింగ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## రామలింగేశ్వర ఆలయంలో బాన్సువాడ సిఐ పూజలు

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో గల రామలింగేశ్వర ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతయ్య రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామేశ్వర ఆలయం విశిష్ఠతను సీఐకి వివరించడంతో పాటు ఆలయంలో స్వయంభువుడిగా వెలిసిన లింగం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు నియోజకవర్గం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేస్తారని తెలిపారు. ముఖ్యంగా శ్రావణ మాసం ఆఖరిసోమవారం, కార్తీకమాసం పౌర్ణమి దినాలలో చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వస్తారని తెలిపారు.

## భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

**ప్రజాపక్షం/పిట్లం:** కార్తీకపౌర్ణమి సందర్భంగా పిట్లం మండలకేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గల శైవక్షేత్రాలు, ఇతర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలకేంద్రంలోని రామేశ్వరాలయంలో మహిళ భక్తులు తులసి(తులసిమాత వివాహం) ప్రత్యేక పూజలు నిర్వహించగా బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక మాస దీపాలు వెలిగించి ఆలయ ప్రాంగణంలో దీపాల కాంతులతో నిండిపోయింది. శివ భక్తులు శివనామస్మరణతో తరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## కమనీయం.. లక్ష్మీ నృసింహుడి కల్యాణం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** పెద్దపల్లి మండలం దేవునిపల్లి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణం వేదపండితులు రామాచార్యులు, ఆరుట్ల శ్రీదర్ చార్యులు, కొండపాక శ్రీకాంత్ చార్యులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా కళ్యాణ వేడుకలు నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుండి స్వామివారి కళ్యాణం తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. స్వామివారి కళ్యాణాన్ని జనం కన్నులారా వీక్షించి తనివితీరారు.అనంతరం ఆలయంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.ఈ ఏడు కనీవినీ ఎరుగని రీతిలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో జాతర ప్రాంగణం కిక్కిరిసింది. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, సీఐలు ప్రవీణ్ కుమార్,అనిల్ కుమార్, ఎస్సైలు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పెద్దపల్లి రూరల్ ఎస్సై మల్లేష్ ఆద్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి శంకరయ్య, ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డుపల్లి సదయ్య, ధర్మకర్తలు శ్రీపతి సుమన్, ఆడెపు శ్రీదేవి వెంకటేష్, ముడుసు శ్రీనివాస్, ఇట్యాల సతీష్, తాళ్లపల్లి రాజమౌళి, గాజుల సురేష్, కాంగ్రెస్ నాయకులు బొక్కల సంతోష్, తలారి సాగర్, నరేష్, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆశీస్సులతో పెద్ద పెల్లి నియోజకవర్గ ప్రజలు చల్లగా ఉండాలని, పాడి పంటలు సుభిక్షంగా పండి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి స్వామి వారిని వేడుకున్నారు. బుధవారం రోజున పెద్దపల్లి మండలం అందవులపల్లి లో గల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారి ముక్కులు చెల్లించి, నియోజకవర్గ ప్రజలు మరియు రైతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించారు.అనంతరం ఆలయ కమిటీ తరఫున ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించి, వారి సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆశీర్వచనాలు అందించారు.ఈ సందర్భంగా స్థానిక భక్తులు, మాజీ సర్పంచ్ చిట్యాల కిషన్,మాజీ ఎంపీటీసీ లక్ష్మ ణ్, బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు కొయ్యడ సతీష్ గౌడ్, సదయ్య, గ్రామ ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మార్వాడీ గో బ్యాక్ జెఎసి జిల్లా కన్వీనర్‌గా సతీష్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** మార్వాడీ గో బ్యాక్ జెఎసి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గా పెద్దపల్లి పట్టణానికి పోలం సతీష్ యాదవ్, జిల్లా కో కన్వీనర్ గా పెద్దపల్లి మండలం రాఘవపూర్ కు చెందిన కల్లెపల్లి రవిని నియమించినట్లు రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు.ఈ మేరకు బుధవారం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సన్నీ మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్ నుండి వచ్చిన మార్వాడీలు స్థానికుల వ్యాపార, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. మార్వాడీల వల్ల రాష్ట్రంలో అనేక రంగాల్లో స్థానికులు ఉపాధి కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మార్వాడీల ఆగడాలను అడ్డుకుని స్థానికంగా ఉన్న వివిధ వర్గాల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాగా తమపై నమ్మకంతో జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ గా నియమించిన సన్నీకి సతీష్, రవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద భాస్కర్ యాదవ్, గద్దల వినయ్ కుమార్, బొడ్డుపల్లి రామ్మూర్తి, అలువాల రాజేందర్, బొడ్డుపల్లి రమేష్, ఆరేపల్లి మనోజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు: సిపి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** మహిళల రక్షణకై షీ టీమ్స్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని, బాధిత మహిళలు తమకు ఏలాంటి సమస్యలు ఎదురైన నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని, ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. మహిళల రక్షణ కోసమే రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో రెండు షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని ఆయన బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. షీ టీమ్ సభ్యులతో పాఠశాలలు, కళాశాలల వద్ద ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడుతున్న యువకుల పట్ల గట్టి నిఘా ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా పోక్సో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం, నూతన మహిళా చట్టాలు, డయల్ 100, టిసేఫ్ యాప్, మహిళా భద్రత, రక్షణ చర్యలు వంటి అంశాలపై మహిళలు, యువతులు, విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులను ఆన్‌లైన్, క్యూర్ కోడ్ స్కానర్, వాట్సప్‌ల ద్వారా కూడ స్వీకరిస్తారని తెలిపారు. షీటీమ్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రామగుండం పోలీసు కమిషనరేట్ షీ టీం నంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ నంబర్ 8712659386, మంచిర్యాల జోన్ షీ టీమ్ నంబర్ 8712659386 లకు కాల్ చేసి వాట్సప్ మెసెజ్ ద్వారా ఫిర్యాదు చేయాలని లేదా డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీసు సాయాన్ని పొందాలని సీపీ కోరారు.

## యువతి పెండ్లికి అపన్న హస్తం



**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బామ్లా నాయక్‌తండా గ్రామానికి చెందిన బదావత్ అమర్‌సింగ్ లలితల కుమార్తె సౌమ్య వివాహం భూషణ్‌తో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నవ దంపతులను గ్రామ మాజీ సర్పంచి బదావత్ రాజునాయక్ లక్ష్మి దంపతులు ఆశీర్వదించి వారికి రూ.10 వేలు సాయం అందజేశారు. గ్రామంలో ఏ పేద యువతి వివాహం జరిగిన రాజునాయక్ దంపతులు తమ వంతు ఆర్థిక సహకారాన్ని తల్లి దండ్రులకు అందజేస్తుండటం పట్ల గ్రామ ప్రజలు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గట్టయ్య, రాజు, రాజేష్, సరిత, విజయ, కళావతిలు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** అనారోగ్య సమస్యను తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు .ఈ ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని భీమ్ రాజు పల్లి గ్రామంలో జరిగింది.స్థానిక ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భీమ్ రాజు పల్లి గ్రామానికి చెందిన సింగారపు చిన్న మల్లయ్య (81)గత నాలుగు సంవత్సరాల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు .పలు ఆస్పత్రుల్లో చూపించిన తగ్గక పోవడంతో తనకున్న వ్యాధి నయం కాదని తెలుసుకొని చికిత్స వలన కలిగే బాధలు భరించలేక జీవితంపై విరక్తి చెంది గత నెల 17 వ తేదీన తన ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు .గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి కరీంనగర్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు .డాక్టర్ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని తెలపడంతో అక్కడి నుంచి చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించాడు .మృతుడి కుమారుడు సింగారపు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు .

## వైభవంగా లక్ష దీపోత్సవం

**ప్రజాపక్షం/మల్లాపూర్:** కార్తిక పౌర్ణమి నీ పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వర కొండకింద, వాల్గొండా గ్రామం లోని గోదావరి నది తీరాన ఉన్న శ్రీ రామలింగేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుండి శ్రీ కనక సోమేశ్వర ఆలయం, వాల్గొండా లోని రామలింగేశ్వర ఆలయం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు స్వామివార్లను దర్శించుకుని దీపాలు వెలిగించి మొక్కులను చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.

## కష్టాల్లో రైతులను పట్టించుకోని ప్రభుత్వం: కవిత



ప్రజాపక్షం/భీమ్‌గల్ : రైతులు కష్టాల్లో ఉంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో బుధవారం జరిగిన జాతర సందర్భంగా లింబాద్రి గుట్ట శ్రీలక్ష్మీ నృసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నింబాచల నృసింహుడు చాలా పవర్ గల దేవుడని కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు. లింబాద్రి దేవుడి దయతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. మండలానికి సంబంధించి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌తో పాటు నియోజకవర్గంలో మరో ముగ్గురు కార్పోరేషన్ చైర్మన్లు ఉన్నారని, ఇక్కడి ఎమ్మెల్యే ఎవరన్నది పక్కన పెడితే రూలింగ్ పార్టీదే నడుస్తోందన్నారు. అయినా మక్కలు 80 శాతం అమ్మకాలు పూర్తయిన తర్వాత ఇప్పుడు కాంటా పెడుతున్నారని ఇది దారుణం, అన్యాయం అన్నారు.

## పదోన్నతి పొందిన అధికారికి ఎఐటియుసి అభినందనలు



నూతన వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ నియామకం

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ నందు వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలందించిన రాజ్‌కుమార్ అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా గుర్తింపు సంఘం అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) యూనియన్ తరపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ స్థానంలో బలవేని శ్రీనివాస్ (హెడ్ ఓర్మెన్)ను యూనియన్ తరపున వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం ఆయనను ఎస్ఆర్‌పి ఓసిపి ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ ఓంకారి బాబులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ సెక్రటరీ మోతె లచ్చన్న, మైనింగ్ స్టాఫ్ నాయకులు నారాయణ, ఆంజనేయులు, అజయ్, హెచ్ఇఎంఎం సెక్షన్ ఇన్‌చార్జి మల్లయ్య, పాషా పాల్గొన్నారు.

## రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/బోధన్ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ. 500 ల బోనస్ ఇచ్చి ఆదుకుంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఆగ్రో ఛైర్మన్ కాసుల బాలరాజు ల చిత్రపటాలకు వర్ని రైతుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ధాన్యం కాటాబెట్టిన మూడు రోజుల్లోపు మద్దతు ధరతో పాటు 500 రూపాయాల బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నందుకు ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఛైర్మన్ కాసుల బాలరాజు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు పోచారం భాస్కర్ రెడ్డి లకు నియోజకవర్గ రైతుల తరపున వర్ని మండల కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ని పిఏసిఎస్ అధ్యక్షుడు నామాల సాయిబాబా, వర్ని ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, మాజీ జడ్పీటీసీ రంజానాయక్, జాకోరా పిఏసిఎస్ అధ్యక్షుడు దశరథ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కార్యదర్శి అబ్దుల్ బారి, పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు నేమాని వీర్రాజు, వర్ని మండల సీనియర్ నాయకుడు కల్లాల్ గిరి, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ గౌడ్, పిఏసిఎస్ డైరెక్టర్ నరేడ్ల చిన్న, సాయిలు(బుడన్న), ఏఎంసి మాజీ డైరెక్టర్ పీర్యా నాయక్, ఏఐబిఎస్ఎస్ వర్ని అధ్యక్షుడు మాలోత్ గంగారాం, గోపి నాయక్, మారుతి, మండల యూత్ నాయకుడు బుద్ధ గంగాధర్, సద్దాం, అనాల బాబు రావు, రమేష్ గౌడ్, బాలాజీ, లచ్చిరామ్, బుర్ర శంకర్ గౌడ్, శంకరప్ప, షేక్ యునుస్, దుబాస్ రాములు, వర్ని మండల రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నుల పండుగా కార్తీక పౌర్ణమి జాతర



ప్రజాపక్షం/దండేపల్లి: దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. కన్నుల పండుగగా జరిగిన ఈ జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, ఘాట్ రోడ్డు ద్వారా గుట్టపైన గల సత్యదేవున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని వందలాది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. మహిళలు రావి ఉసిరి చెట్ల వద్ద తమ కుటుంబాలను చల్లగా చూడాలని కోరుకుంటూ కార్తీక వత్తులు వెలిగించి దీప దానాలు చేశారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసిన మహిళలు నూతన దంపతులు గోదావరమ్మకు దీపాలు వదిలారు. పౌర్ణమి సందర్భంగా మంచిర్యాల మాజీ శాసన సభ్యుడు నడిపెల్లి దివాకర్ రావు, మంచిర్యాల ఆర్డిఓ శ్రీనివాస రావు సత్యనారాయణ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మంచిర్యాల ఏసిపి ప్రకాశ్ పర్యవేక్షణలో లక్సెట్టిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో దండేపల్లి ఎస్ఐ తహసీనొద్దీన్ పోలీసులతో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## ఫైవ్ స్టార్ రేటింగ్ తనిఖీ బృందం పరిశీలన




ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఫైవ్ స్టార్ రేటింగ్ మూల్యాంకన తనిఖీ బృందం పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కార్యక్రమం ప్రారంభించారు. ఓఎస్‌డి కోల్ కంట్రోల్ ఆఫీసర్ ప్రాంతీయ కార్యాలయం, నాగ్‌పూర్ రాజేంద్ర చోలే, ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్, రీజియన్ సేఫ్టీ జిఎంలు రఘుకుమార్, జిఎం మధుసూదన్, పి మోహన్ రావు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి) వరంగల్ ప్రొఫెసర్ పి. శ్రీధర్, ఓఎస్‌డి కోల్ కంట్రోల్ ఆఫీసర్ ప్రాంతీయ కార్యాలయం, కొత్తగూడెం ఎ కృష్ణమోహన్ రావు పాల్గొన్నారు. కమిటీ సభ్యులకు సింగరేణి సంస్థలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, గనులలో తీసుకుంటున్న భద్రతా చర్యలు, కార్మిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆర్కె 6 యూనిట్ రికార్డులను పరిశీలించారు. సింగరేణి సంస్థ గనుల భద్రతా ప్రమాణాలు నిర్వహణ పట్ల కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ఎన్ సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, అన్ని గనుల విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## నేరాల్లో పట్టుబడిన 16 వాహనాల వేలం

ప్రజాపక్షం/చెన్నూరు : వివిధ నేరాల్లో పట్టుబడిన మొత్తం 16 ద్విచక్ర వాహనాలను ఈ నెల 06న చెన్నూర్ ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం వేయనున్న 16 వాహనాల్లో ఆరు నడిచే సామర్థ్యం గల ద్విచక్ర వాహనాలు కాగా, పది ద్విచక్ర వాహనాలు స్క్రాప్ రూపంలో ఉన్నాయని, నేరాల్లో పట్టుబడిన 16 వాహనాల వేలంలో పాల్గొనాలనే ఆసక్తి గలవారు మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సంద్రించాలని ఈ సందర్భంగా సిఐ హరి తెలిపారు.

## సెక్రటేరియట్‌లో సుదర్శన్‌రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్‌రెడ్డిని సెక్రటేరియట్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఐడీసీయంయస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ సర్పంచ్ చిన్నసాయరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

## సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాపక్షం/మందమర్రి : సింగరేణి కంపెనీ స్థాయిలో జరిగిన సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విజేతలకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ బుధవారం బహుమతులను అందజేశారు. మందమర్రి ఏరియాలోని సిఇఆర్ క్లబ్‌లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5వ తేదీ వరకు 2 రోజులు ఈ పోటీలు ఘనంగా జరిగాయి. విజేతలు రాబోయే కోల్ ఇండియా స్థాయి సాంస్కృతిక పోటీలలో పాల్గొనే అవకాశం దక్కుతుందని, ఆ స్థాయిలో కూడా విజయం సాధించి సింగరేణికి మంచి పేరు ప్రఖ్యాతి తీసుకురావాలని జిఎం రాధాకృష్ణ ఆకాంక్షించారు. ప్రత్యేకంగా ఫోక్ డాన్స్ విభాగంలో మందమర్రి బెల్లంపల్లి ఏరియాల ఎన్.శ్రీనివాస్ బృందం మొదటి బహుమతి గెలుచుకోవడం గర్వకారణమని జిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సిఎంఒఎఐ అధ్యక్షులు రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్ సీనియర్, పిఒ., క్రీడల సూపర్వైజర్లు డి. జాన్ వెస్లీ, సిహెచ్ అశోక్, ఎం. నరేందర్ రెడ్డి, పరస శ్రీనివాస్, హెచ్. రమేష్, క్రీడల సంయుక్త కార్యదర్శి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు

ప్రజాపక్షం/ఖానాపూర్:ఖానాపురం మండల కేంద్రంలో గత నెల రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలతో ఖానాపురం గ్రామ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తెలిసిన వారి పనే అన్నట్లుగా రోజుకో కొత్త కోణంలో దొంగలు దొంగతనాలు చేస్తూ కొన్ని చోట్ల సిసి కెమెరాలకు సైతం చిక్కకుండా దొంగతనాలకు పాల్పడుతున్నారు. గ్రామంలో ఎలాంటి అనుమానం రాకుండా ఉదయం గ్రామంలో తిరుగుతూ చోరీకి స్కెచ్ వేసి మరి పక్కాగా దొంగలు వారి ప్లాన్ అమలు చేస్తూ మా రూటే సపరేటు అంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో వారు ఇదే అదునుగా భావించి రోజుకోక ఏరియాలో దొంగతనాలు చేస్తూ అందినకాడికి దోచుకోవడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. ఖానాపురం మండల శివారు పెద్దమ్మ గద్ద గ్రామంలో గుగులోతు నరసింహకు చెందిన లక్ష రూపాయల విలువ గల ఆరు గొర్రె పొట్టేలును దొంగలు ఎత్తుకెళ్ళినట్లు దీనిపై బాధితుడు కేసు సైతం పెట్టినట్లు తెలిపాడు. కేసు విచారణలో ఉండగానే మరల తనకు సంబంధించిన రూ.20వేల విలువ గల గొర్రెను ఎత్తుకెళ్ళినట్లు దీనిపై బాధితుడు సైతం కేసు పెట్టినట్లు తెలిపాడు. కేసు విచారణలో ఉండగానే మరల తనకు సంబంధించిన గొర్రెను దొంగలు దర్జాగా ఎత్తుకెళ్ళినట్లు సిసి కెమెరాల్లో సైతం రికార్డు అయ్యింది. అదే గ్రామంలో కోళ్లను సైతం ఎత్తుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల కట్టింపు చర్యలకు ఎలాంటి ప్రతిస్పందన లేకపోవడంతో వారు తమ రూట్‌ను మార్చి తాజాగా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన మడల బిక్షపతి కుమారుడికి చెందిన పల్సర్ బైక్ సైతం ఎత్తుకెళ్ళినట్లు దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు దొంగలను పట్టుకుంటేనే తాము కంటి నిండా నిద్రపోగలుగుతామని మండల ప్రజలు వాపోతున్నారు.

## బోధన్ చక్రేశ్వర ఆలయంలో వైభవంగా లక్ష దీపోత్సవం

**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలోని చక్రేశ్వర ఆలయంలో కార్తీకమాసం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ఈవో రాములు ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోధన్ మండల, పట్టణంలోని భక్తులు ఆలయానికి విచ్చేసి లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని చక్రేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు జరగకుండా చూడాలి..

**ప్రజాపక్షం/నందిపేట్ :** బాల్య వివాహాలు జరగకుండా చూడాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు, మండల తహసీల్దార్ సంతోష్‌లు బుధవారం మండల గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిరోదక చట్టం గురించి వివరించారు. ఎక్కడైనా దీనిని అతిక్రమిస్తే 1098 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ వసంత రావు, పోలీసుశాఖ నుంచి ఐకెపి, ఐసిడిఎస్ తరపు నుంచి అధికారులు హాజరయ్యారు.

## క్రీడలతో స్నేహ వాతావరణం పెంపొందించే లక్ష్యం

**ప్రజాపక్షం/ఎడపలి:** క్రీడల ద్వారా యువతలో సామరస్యం, స్నేహ పూర్వక వాతావరణాన్ని పెంపొందించే లక్ష్యంతో బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ శివారులో గల పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించే క్రికెట్ పోటీలను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్ బోధన్ డివిజన్‌లోని మూడు మండలాలైన బోధన్, ఎడపల్లి, రెంజల్ లకు చెందిన క్రికెట్ టీమ్‌ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిందని, ఆయా మండలాల క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో 26టీమ్‌లు ఉత్సాహంగా పాల్గొంటున్నారని అన్నారు. యువత చెడు, వ్యసనాల భారిన పడకుండా ఉండేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని, అందులో భాగంగానే యువతను, ప్రజలను చెడు వ్యసనం నుంచి మళ్లించేందుకు, అవగాహన కల్పిస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ విజయ్ బాబు, రూరల్ ఎస్సై, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

**ప్రజాపక్షం / కౌటాల :** మండల పరిధిలోని పలు గ్రామాలలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. వేకువజాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో ఆలయాల వద్దకు చేరుకుని ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే గంగలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తిక దీపారాధన చేశారు. అనంతరం ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా ఎక్కాహం నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

# ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

### భక్తులతో పోటెత్తిన ఆలయాలు

**ప్రజాపక్షం/ఎడపలి:** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాలలో మహిళలు పెద్ద ఎత్తున తులసి వివాహాలు, ఉసిరి దీపారాధన, వత్తుల దీపారాధన చేశారు. ఈ మేరకు మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద గల శివాలయంతో పాటు స్వయం భూ శివాలయంలో, ఎడపల్లి మండల కేంద్రంలోని శివాలయం, ఠాణాకలాన్ శివారులో గల శివాలయంలో, కుర్నాపల్లి గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయంలలో భక్తులు ఉదయం నుంచి శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు, అర్చనలు చేశారు. గ్రామాలలో ఆధ్యాత్మిక



శోభ సంతరించుకుంది. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను వెలిగించారు. పలు గ్రామాల్లోని ఆలయాల్లో సామూహిక దీపారాధనలు చేశారు.

## పోరాటాలతోనే అమరుల ఆశయ సాధన..

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** పీడిత ప్రజల అభ్యున్నతి కోసం పోరాటలు చేసి,ప్రాణాలు అర్పించి అమరులైన వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు నంది రామయ్య అన్నారు.బుధవారం ఖానాపూర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 58 ఏళ్ల భావర విప్లవోద్యమంలో అమరులకు సంస్మరణ సభ నిర్వహించారు.సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు నంది రామ్మ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న దోపిడీ విధానాలపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.పీడిత ప్రజల హక్కుల సాధనకు అమరులు,చూపిన మార్గం ప్రజా పోరాటాలే శరణ్యమని అన్నారు.ఆపరేషన్ కగార్ పేరిట బూటకపు ఎన్కౌంటర్లు చేస్తూ అటవీ సందను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోంద




న్నారు.అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మడవి అంకుశ్ రావు,జక్కుల రాజన్న,సుదర్శన్,లక్ష్మణ్ వర్మ,కుర్మ రాజన్న,బీమ్ రావు,సోనే రావు,గోనే లచ్చన్న,మధు జైతు,మారుతి తదితరులు పాల్గొన్నారు.

## హరిహర దేవస్థానంలో కార్తీక పౌర్ణమి మహోత్సవం

**ప్రజాపక్షం/మందమర్రి :** కార్తీక పౌర్ణమి పుణ్యతిథి సందర్భంగా మందమర్రి శ్రీ హరిహర దేవస్థానంలో భక్తి తరంగాలు ఉప్పొంగాయి. గురుస్వామి, సదానందం స్వామి ఆధ్వర్యంలో జరిగిన దివ్యోత్సవం భక్తజనులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఆలయంలో ఉన్న వినాయక స్వామి, స్వామి అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వామి వళ్ళిదేవసేన సమేతుడు, నాగేంద్ర స్వామి, సంతోషి మాత, శివ పార్వతుల స్వామివారు, ఆంజనేయ స్వామి, రమా సహిత సత్యనారాయణ స్వామి వంటి అన్ని దేవతా విగ్రహాలను పవిత్ర పౌర్ణమి నాడు మంగళ వాద్యాల నడుమ ఉత్సవ విగ్రహాలతో కలిసి పవిత్ర గోదావరి నది స్నానానికి తీసుకెళ్లి శాస్త్రోక్తంగా స్నానమాచరించారు. గోదావరి తీరం భక్తుల హరిహర నామస్మరణతో, దీపాల వెలుగులతో, వేదఘోషాలతో నిండిపోయింది. భక్తులు గంగాజలం చల్లుకుంటూ స్వామియే శరణం అయ్యప్పా ఓం నమః శివాయ, జై సంతోషీమాతా నినాదాలతో గగనాన్ని మార్మోగించారు. గురుస్వామి సదానందం స్వామి మాట్లాడుతూ... కార్తిక పౌర్ణమి రోజున దేవతల సమిష్టి స్నానం, దీపారాధన, హరిహరారాధన చేయడం భక్తుని జీవితంలో మహాపవిత్ర క్షణం అని, ఈ స్నానం ద్వారా హరిహర దయతో పాపాలు నశించి, మనసు పరమశాంతిని పొందుతుందని ఆశీర్వచనం అందించారు. ప్రతి ఏటా ఆచరించబడే ఈ కార్తీక పౌర్ణమి మంగళ వాద్యాల మహోత్సవం మందమర్రి ప్రాంతానికి ఆధ్యాత్మిక గర్వకారణంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మోర్తాడ్‌లో ఘనంగా జరిగిన దీపోత్సవం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** కార్తీక పౌర్ణమి వచ్చే పౌర్ణమి హిందువులకు పరమపవిత్రమైన రోజు ఇది మహాశివరాత్రితో సమానమైన పర్వదినం అని పెద్దలు అంటారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు కార్తీక పౌర్ణమి పర్వదినాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు శివాలయాలలో దీపారాదన చేయడం, ముక్కోటి దేవతలకు పూజలు చేయడమే సకల పుణ్యానాధులలో స్నానం చేసిన ఫలం దక్కుతుందని కార్తీక పౌర్ణమి నాడు చేసిన దీపారాధనతో సుఖ సౌఖ్యాలతో జీవిస్తారని పెద్దలు చెపుతారని స్థానిక ప్రజలు అంటున్నారని స్థానిక ప్రజలు చెప్తున్నారు. అందులో భాగంగానే బుధవారం రోజు మోర్తాడ్ మండల కేంద్రంలోని శివాలయంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామంలోని అనేక మంది మహిళలు దీపారాదన చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గీత శర్మ తదితరులు ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా శ్రీకౌండిన్య మహర్షి జయంతి



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** పెర్కిట్ శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శ్రీ కౌండిన్య మహర్షి జయంతి వేడుకలు జిల్లా గౌడ సంఘం, జిల్లా గౌడ యువ సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తుల మూల పురుషుడు జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా దేగాం యాదాగౌడ్, రామాగౌడ్ హాజరై మాట్లాడారు. గౌడ కులస్తులందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. గౌడ కులవృత్తిని కాపాడుకునేలా ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. అన్ని రంగాల్లో గౌడులు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌడ సభ్యులు శ్రీనివాస్, నరేష్, సునీల్, నరేందర్, హరీష్, చరణ్, మహేందర్, ఉదయ్, శ్రీనివాస్, కిరణ్, శ్రీకాంత్, నవీన్, సంతోష్, గౌడ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం

**ప్రజాపక్షం /జన్నారం :** జన్నారం మండలం రేండ్లగూడ గ్రామంలోని శ్రీ సీతారామ దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాస్ వైదిక పద్ధతుల్లో వ్రతాన్ని నిర్వహించారు. వ్రత సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో మార్మోగింది. ఈ వ్రతంలో కటకం కోటేష్, చేటుపెల్లి సత్యం, పెరుగు దుర్గయ్య, మోర రాజేశం, మెంగని కొమురవెల్లి, మోర గణేష్, బుర్ర పెద్ద రాజా గౌడ్, బుర్ర కిరణ్, పెద్ది అరవింద్, పెరుగు సుధాకర్, బూరగడ్డ రాకేష్ దంపతులు సహా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

## అరకొర ఏర్పాట్లతో భక్తుల ఇక్కట్లు

**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా అరకొర ఏర్పాట్ల కారణంగా భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఆలయ కమిటీ వారు చేసిన ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో భక్తులు అసౌకర్యానికి లోనయ్యారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేసినప్పటికీ, సైడుకు తడకలు కట్టడం వలన గాలి సరిగా రాక భక్తులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా, పదహారు వందల రూపాయల వ్రతాల బుకింగ్ కౌంటర్ వద్ద పందిళ్లు వేయకపోవడంతో, ఎండకు మహిళలు తమ కొంగులు కప్పుకొని క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ఉన్నప్పటికీ, ట్రాఫిక్ జామ్ కావడం వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రసాదం కోసం అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల భక్తులు అసహనానికి గురయ్యారు.

## ఘనంగా ముగిసిన భీమన్న ఉత్సవాలు

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండలంలోని చేపూర్ గ్రామంలో భీమన్న ఆలయం వద్ద ఆదివాసం నాయకపోడ్ కులస్తులు ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి బుధవారం కులదైవం భీమన్న దేవుని కళ్యాణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .అదేవిధంగా ఈ సంవత్సరం కూడా ఆదివాసి నాయకపోడ్ కుల సభ్యులు ఘనంగా భీమన్న దేవుని కళ్యాణం ఉదయం నిర్వహించి అగ్గి గుండం కుటుంబ సభ్యులతో దున్నడం జరిపించారు. భీమన్న గుడి నిర్మించి 17వ సంవత్సరాలవున్నందున గ్రామానికి చెందిన మీనుగు నాగరాజు తండ్రి కీ॥శే ॥ మీనుగు అమ్మన్న పెద్దరాజన్న జ్ఞాపకార్థం సంఘ సభ్యుల సహకారంతో జిల్లాస్థాయి ఆదివాసి నాయకపోడ్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ కడ్డీ పోటీలను ఉమ్మడి జిల్లాల డీఎస్పీ మధుసూదన్ జడ్పీ సీఈఓ సాయన్న ఆదివాసి నాయకపోడ్ జిల్లా అధ్యక్షులు గాండ్ల రాంచందర్ గౌరవ అధ్యక్షులు బండారి భోజన్నతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాస్థాయిలో ఆదివాసి నాయకపోడ్ కులస్తులు ఐక్యంగా జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించడం శుభ పరిణామమని ఆదివాసి నాయకపోడ్ కులస్తులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. అలాగే గ్రామానికి చెందిన వీడీసీ అధ్యక్షులు సారంగి శ్రీకాంత్ టీ షర్ట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సేవ సంఘం అధ్యక్షులు పుట్ట రాజేశ్వర్, కార్యదర్శి రవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి, సాందన్న, గంగాధర్, సత్యనారాయణ, గంగారెడ్డి, సాయన్న, గంగాధర్, గౌతమ్ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించాడని, వ్యక్తి గురించి ఏమైనా సమాచారం ఎవరికైనా తెలిస్తే 1వ టౌన్ పోలీసు స్టేషన్ నిజామాబాద్‌లో సంప్రదించాలని 1వ టౌన్ సిఐ రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్‌లో గతనెల అక్టోబర్ 19న సాయంత్రం 5 గంటలకు తిలక్ గార్డెన్ రూప్ ఛాయా ఫోటో షాప్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి కిందపడి ఉండగా పక్కన ఉన్నవారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసు సిబ్బంది 108 లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వెంటనే అక్కడున్న వైద్యులు పరిశీలించి అడ్మిట్ చేసుకున్నారు. బుధవారం 5వ తేదీ ఉదయం 9 గంటలకు మృతి చెందినట్టు నిర్ధారించారు. అతని వయసు సుమారు 50 నుంచి 55 వరకు ఉంటుంది. అతనిపైన బట్టలు పెసరి రంగు ఫుల్ షర్ట్, తెలుపు రంగు లుంగీ ఉన్నాయన్నారు. వ్యక్తి వాలకాన్ని బట్టి చూస్తే భిక్షాటన చేసుకునే వ్యక్తిగా కనబడుతున్నదని, జేబుల్లో పరిశీలించగా ఎటువంటి ఆధారాలు దొరకలేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తి గురించి ఎవరైనా సంప్రదించాలనుకుంటే **8712659714** నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

## అడవి పందుల దాడిలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/ములుగు:అటవీ పందుల దాడిలో రైతు మృతిచెందిన సంఘటన ములుగు మండలం దేవగిరిపట్నంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే దేవగిరిపట్నం గ్రామానికి చెందిన కుందూరు వెంకటేశ్వర రెడ్డి(65) అనే రైతు ఉదయం తన పంట పొలం వద్దకు వెళ్ళి వరి పొలాన్ని పరిశీలిస్తుండగా అడవి పందులు దాడి చేశాయని, ఈ దాడిలో రైతు తీవ్ర గాయాలపాలై పరిగెడుతూ ప్రమాదవ శాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## హరీష్‌రావుకు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శ



ప్రజాపక్షం/రాయపర్తి: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం ఆయన చిత్రపటానికి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు హన్మంతరావు, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాపక్షం/ఖిలావరంగల్:వరంగల్ నగరంలోని 28వ డివిజన్ ప్రాంతంలోని సంతోష్ మాత కాలనీ, సంతోష్ మాత కాలనీ 2లో వరద ముంపు బాధితులకు 450 కుటుంబాలకు 16 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్నటువంటి ప్రధాన సమస్యల గురించి కమిషనర్‌తో చర్చించగా కమిషనర్ సానుకూలంగా స్పందించి ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి రాజేష్, శంకర్ సింగ్, చకిలం సతీష్, బగల్ కళ్యాణ్, నరిసంహారెడ్డి, కనకాచారి, బోయిని రవి, పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయంలో పోటెత్తిన భక్తులు

ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండలంలోని పాలంపేట గ్రామ సమీపంలో గల రామప్ప దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు రామలింగేశ్వర స్వామిని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.దీంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్ లు స్వామివారికి అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అక్కడికి వచ్చిన భక్తులు రామప్ప చరిత్ర గురించి టూరిజం గైడ్లు గోరంట్ల విజయకుమార్ ,తాడబోయిన వెంకటేష్ లు వివరించారు.

# బుగులోని జాతరలో ఎమ్మెల్యేతో సెల్ఫీ

భక్తులతో కిటకిట లాడిన బుగులోని జాతర

జాతరలో ప్రభ బండ్ల ప్రత్యేక ఆకర్షణ

ప్రజాపక్షం/రేగొండ :రేగొండ మండలం తిరుమల గిరి శివారులో నీ శ్రీబుగులోని వెంకటేశ్వర స్వామి జాతర బుధవారం భక్తుల తో కిట కిట లాడింది. కార్తీక మాసం, అందులో ప్రభుత్వ సెలవు దినం కావడం భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు. దింతో జాతర ప్రాంగణంలో ఒకేసారి గా అలజడి మొదలయింది. అదే విధంగా నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అదే సమయానికి రావడం తో భక్త జనాల ఆయన తో సెల్ఫీ లు దిగారు. దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ సవత్సరం స్వామి జాతర ఏర్పాట్లు కోసం అధిక నిధులు వెచ్చించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. కొత్తగా భక్తుల స్నానాల కోసం గుండం ఏర్పాట్లు, స్వామి వారి దర్శనం కోసం వెళ్లె మార్గ మెట్లు వెడెల్పు, స్వామి వారి కళ్యాణం కోసం మంటపం ఏర్పాటు ఇంకా అనేక సదుపాయాలు చేసినట్లు ఆయన తెలిపారు.

**జాతర లో ప్రత్యేక ఆకర్షణ గా ప్రభ బండ్లు**

జాతర లో ప్రభా బండ్లు ప్రత్యేక ఆకర్ష ణ నిలిచాయి రేగొండ ఉమ్మడి మండలో నీ భక్తులు తమ మొక్కులు చెల్లించు కునేందు కు గాను తరలి రావడం విశేషం జాతర లో భక్తుల సౌకర్యార్థం మెడికల్ క్యాంపు, మినరల్ వాటర్, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయడం జరిగింది.

## ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు అందించాలి



ప్రజాపక్షం/తొర్రూరు : పట్టణ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలకు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బందు సాయిలు అన్నారు. ఆరు నెలలుగా డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా అధికారులు, ఎమ్మెల్యే స్పందించకపోవడం సరికాదన్నారు. మహిళలు ఇండ్ల పంపిణీ కోసం నిరసనలు చేపడుతున్నా ఎమ్మెల్యే వారి వద్దకు వచ్చి హామీనిచ్చిన దాఖలాలు లేవని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, తొర్రూరు మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి.యాకూబ్, మండల కమిటీ సభ్యులు దర్గయ్య, కొమ్ముకబోయిన యాకయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అమీర్, డబుల్ బెడ్రూం ఇండ్ల పోరాట కమిటీ లీడర్లు శోభ, ధర్మయ్య, వరలక్ష్మి , అరుణ, షమీనా, అమీనా, శ్రీలత, నాగమణి, సాయిలు, మంజుల, నరేశ్, హరి, సభ్యులు శ్రీను, యాకమ్మ, ఐలమ్మ, మంజుల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



ప్రజాపక్షం/ నర్సంపేట : నర్సంపేట మండలం లోని గురిజాల గ్రామానికి చెందిన ఆముదాల భాగ్యలక్ష్మి లక్ష్మీ నారాయణ దంపతుల కూతురు ప్రహర్షిక ఎంబిబిఎస్‌లో సీటు సాధించారు. బుధవారం బిఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా శాలువా, పూలబొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెల్లి నర్సింగం మాట్లాడుతూ మంచిగా చదివి గొప్ప డాక్టర్ అయి పేదలకు వైద్య సేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు గడ్డం కొమురయ్య, బండారి శ్రీలతరమేష్, న్యాయవాది. పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జీ మోటూరి రవి, రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్నరాజమల్లు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రీ కుమారస్వామి, గౌడ సంఘం గౌరవాధ్యక్షుడు మంచిక దేవేందర్, మాజీ వార్డు సభ్యులు కొక్కు రామ్‌రాజు, మాజీ ఎస్ఎంసి చైర్మన్ కొమ్మ రవి, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దూడెల ప్రకాశ్, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు మోటూరి రవీంద్రచారి, యూత్ మండల సహాయ కార్యదర్శి బూస శ్రీశైలం, సీనియర్ నాయకులు పర్స కోటిలింగం, మర్ద నవీన్, సామల సతీష్, యశోద, నర్సింగం, బండారి మధుకర్, కూనమల్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



ప్రజాపక్షం/తొర్రూరు : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని తొర్రూరు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు. జన విజ్ఞాన వేదిక మండల కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి రమేశ్‌గౌడ్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక మండల శాఖ గౌరవ జిల్లా ఉపాధ్యక్షులు రాయిపెల్లి యాకయ్య సమన్వయంతో చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జెల్ల లక్ష్మి నారాయణ, తండ ప్రభాకర్, కొలుపుల వీరన్నలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తరగతి స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి ఏడాది చెకుముకి పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 8వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. తొర్రూరు మండల అధ్యక్షులు తాళ్లపల్లి రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ సైన్స్ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక విశేషంగా కృషి చేస్తుందన్నారు. చెకుముకి పరీక్ష పాఠశాల స్థాయిలో ఈ నెల 7న, మండల స్థాయిలో ఈ నెల 21న, జిల్లా స్థాయిలో ఈ నెల 28న, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12,13,14 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి కోటగిరి కుమార్, కోశాధికారి ఎద్దు వెంకన్న, చెకుముకి కన్వీనర్ పులి ముత్తిలింగం, బాధ్యులు చంద్రమౌళి, పూర్ణచందర్, శ్రీధర్‌రెడ్డి, రమేష్, ఉపేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, వెంకన్న, విజయ్, సుమన్, పందరీ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దాం




ప్రజాపక్షం/ఖానాపూర్:అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి షేర్ మధు పిలుపునిచ్చారు. మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలో అమరుడు కామ్రేడ్ మురళి స్మారక స్థూపం వద్ద సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి షేర్ మధు జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నర్సంపేట డివిజన్ నాయకుడు దండుగుల సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో షేర్ మధు మాట్లాడుతూ భారత విప్లవోద్యమ చరిత్రలో అనేక మంది కమ్యూనిస్టు విప్లవకారులు విప్లవోద్యమ నిర్మాణం కోసం ప్రజల కోసం తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని అన్నారు. కమ్యూనిస్టు విప్లవకారులైన అగ్రశ్రేణి నాయకులు, కార్యకర్తలు అమరులయ్యారన్నారు. నర్సంపేట ప్రాంతంలో కామ్రేడ్స్ పొలుదుగు కృష్ణ, బేబక్క లాంటి ఎందరో కామ్రేడ్స్ తమ ఆత్మ బలిదానాల ద్వారా ఎర్రజెండాను ఇంకా ఎరుపెక్కించారన్నారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాన్ని మార్గదర్శకంగా తీసుకొని నర్సల్బరి, శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు ముందుకు వచ్చాయని గుర్తు చేశారు. ఈ పోరాటాల ప్రభావంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో గోదావరి లోయ విప్లవోద్యమానికి పునాదులు వేశారని తెలిపారు. ఈ విప్లవోద్యమ స్ఫూర్తితో అనేక మంది ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజల తరుపున నిలబడి వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేశారని అన్నారు. ప్రభుత్వం ఉద్యమాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని అనేక కుట్రలు పన్ని ఎంతో మంది విప్లవకారులను నిర్దాక్షిణ్యంగా క్రూరంగా కాల్చి చంపిందని విమర్శించారు. విప్లవకారుల నాయకత్వంలో పది లక్షల ఎకరాలకు పైగా పోడు భూములను ప్రజలకు సాధించి పెట్టిన చరిత్ర కమ్యూనిస్టు విప్లవ కార్యులకు ఉందన్నారు. అమరవీరులను స్మరించుకుంటు సంస్మరణ సభలు జరుపుకోవడం అంటే వారి త్యాగాలను, ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం, అమరవీరులను స్మరించుకుంటు ప్రతిఘటన ఉద్యమాలను నిర్మించినప్పుడు మాత్రమే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని అన్నారు. గ్రామ గ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు జరపాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నారగోని శ్రీను, గట్ల సతీష్, గుండగాని హేమంత్, చిర్ర క్రాంతి కుమార్, అయిలయ్య, పాల్గొన్నారు.

## మెట్టుగుట్ట దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ మెట్టుగుట్ట దేవస్థానంలో అక్టోబర్ 22 తేదీన నుండి నవంబర్ 20వ తేదీ వరకు నిర్వహించబడు కార్తీక మాసోత్సవాలలో భాగంగా బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం స్వామి వారికి ఫల పంచామృతాలతో మహన్యాస రుద్రాభిషేకం, తదుపరి హారతి అనంతరం భక్తులకు దర్శనం కల్పించగా, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామివారిని దర్శించి అభిషేకం చేశారు. సాయంత్రం ప్రదోషకాలంలో ఆకాశ దీపోత్సవం, ఫలపంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలచే మహారుద్రాభిషేకం, ధాత్రి నారాయణ పూజ, జ్వాల తోరణం, స్వామి వారికి లక్ష పుష్పార్చన, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు, రామాలయంలో లక్ష తులసి అర్చనలు, సాలగ్రామ పూజలు నిర్వహించబడింది. తదుపరి కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు మహిళా భక్తులకు వాయినాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణాధికారులు ఆర్ సునీత, ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మలచే నిర్వహించగా ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నవంబర్ 8వ తేదీన శనివారం సంకటహార చతుర్థి సందర్భంగా శ్రీ విజయగణపతి స్వామి వారికి ప్రదోషకాలంలో ఫల పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అనంతరం నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.